# కర్నూలు | నంద్యాల వార్త

27 జూలై, 2024 | శనివారం | పేజీలు 4


## జలాధివాసంలో.. సంగమేశ్వరాలయం



**కొత్తపల్లి, జూలై 26, ప్రభాతవార్త:** ఎగువ నుంచి వస్తున్న వరద వల్ల శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. శుక్రవారం సాయంత్రం సప్తనదుల సంగమేశ్వరంలో సంగమేశ్వరుని ఆలయం శిఖరాలు మాత్రమే దర్శనమిచ్చాయి. ఇంకో నాలుగు అడుగుల మేర నీరుచేరితే సంఘమేశ్వరాలయం పూర్తిగా కృష్ణమ్మ ఒడిలోకి చేరుతుంది. ప్రస్తుతం కృష్ణానది ఎగువన ఉన్న ఉమామహేశ్వ రాలయంలో నిత్యం పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ తెలిపారు. శ్రీశైల జలాశయ పూర్తి నీటిమట్టం 885 అడుగులు కాగ, శుక్రవారం సాయంత్రానికి 861 అడుగులకు చేరింది. ఇంకా 25 అడుగుల మేర కృష్ణాజలాలు చేరితే శ్రీశైల జలాశయం సంపూర్ణంగా నిండుతుంది.

## ఆర్డీయస్ ఆనకట్ట గలగలలు..జలకళలు..!

**- ఆనకట్టను ఎక్కి పారుతున్న నీరు..**



**కోసిగి, జూలై 26, ప్రభాతవార్త**

హోస్పెట్ డ్యాం నుండి తుంగభద్ర నదిలోకి వదిలిన నీరు పెరుగుతూనే ఉంది..శుక్రవారం నాటికి నదిలోకి డ్యాం నుండి సుమారు 98వేల క్యూసెక్కులు వరద నీటిని వదిలారు..దీంతో కోసిగి మండలంలోని ఆర్డీయస్ ఆనకట్టపై నీటి ప్రవాహం ఉవ్వెత్తుతోంది.. ఇది చూపరులకు వినోదంగానే ఉన్నప్పటికి రైతులకు కాస్తా బాధకరంగానే మారిందని చెప్పవచ్చు.. దీనికి తోడు ఈ వరద నీరు సమీప గ్రామాల్లోకి ప్రవేశించే అవకాశాలు ఉండడంతో ఆయా గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.. దీంతో అప్రమత్తమైన అధికారులు హుటా హుటిన నదీతీర గ్రామాల్లో పర్యటించి ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.. నదిలోకి ఎవ్వరు వెళ్లకుండచూస్తున్నారు.. మండల తహశీల్దార్ మురళీ, విఆర్వోలు బాలస్వామి, బసవరాజులతో కలసి ఆర్డీయస్ ఆనకట్టను పరిశీలించారు.. పిల్లలతో పాటు జాలరులు నది సమీపంలోకి వెళ్లరాదని, గ్రామస్తులు నదికి దూరంగా ఉండాలని సూచించారు.. ప్రస్తుతం డ్యాం లోకి 98 వేల, 166 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో డ్యాం కిందికి నదిలోకి అదే రీతిలోనే 98 వేల 166 క్యూసెక్కులనీరు వదులుతున్నారు..డ్యాంలో నీటి సామర్థ్యం 102.576 టిఎంసీలు అనగా 1633 అడుగులకు గానూ ప్రస్తుతం డ్యాంలో1631 అడుగుల నీరు ఉంది.. దీనికి తోడు మరో లక్ష క్యూసెక్కులు వస్తుండడంతో అదే మాదిరి కిందికి నదిలోకి వదులుతున్నారు.ముఖ్యంగా తుంగభద్ర వరదపై ఎలాంటి పుకార్లు నమ్మరాదని, నదిలో వరద వచ్చినప్పటకి నదీతీర ప్రాంతోని ఏ గ్రామం ముంపుకుగురికాదని అధికారులు తెలుపుతున్నారు.. అయినప్పటికి నదీతీర గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు..



## అడంగల్ తారుమారుకు అడ్డాగా.. తహశీల్దార్ కార్యాలయం..!

**- కార్యాలయం ముందు బైఠాయించిన భాదితులు**



**హొళగుంద,జూలై 26,ప్రభాతవార్త**

హొళగుంద రెవెన్యూ కార్యాలయంలో అక్రమాలు తారాస్థాయికి చేరుకున్నాయి. అధికారులు డబ్బులు తీసుకుని రైతుల భూములను ఇష్టానుసారంగా మార్చేస్తున్నారని భాదితులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం భాదితులు మండల రెవెన్యూ కార్యాలయం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ భూములను ఇతరుల పేర్లపైకి ఆన్‌లైన్‌లో అక్రమంగా ఎలా మారుస్తారంటూ ఓ అధికారిని నిలదీశారు. భాదితులకు న్యాయం చేయాలని అక్రమాలు చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని పత్తికొండ ఎమ్మార్పీఎస్ డివిజన్ ఉపాధ్యక్షులు పంచకుండగ వెంకటేష్,మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కోగిలతోట వీరేష్‌లు డిమాండ్ చేశారు. హొళగుందలో సర్వేనంబర్ 424ఎలో పెద్దల నుండి తనకు వారసత్వంగా వచ్చిన 1.47ఎకరాల భూమిలో ఇతరులకు 0.53ఎకరాలు అమ్మగా మిగిలిన 0.94ఎకరాల భూమిని తన అన్న కుమారుని పేరుపైకి అనువంశికం చూపిస్తూ అక్రమంగా మార్చారని చంద్రశేఖర్‌గౌడ్ అనే వ్యక్తి గొడవకు దిగారు. తాను గతంలో ఇతరులకు విక్రమ్ చేసిన ఈ భూమిలో వారు ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారని ఆన్‌లైన్ మార్చేటప్పుడు ఈ ఇండ్లు అధికారుల కళ్లకు కనిపించలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు భార్య,పిల్లలు ఉన్నారని వారసత్వం అనువంశికం వస్తే వారికి రావాలని తన అన్న కుమారునికి ఏ విధంగా వస్తుందని ప్రశ్నిస్తూ తన అన్న కుమారుని పేరుపైకి ఆన్‌లైన్ అడంగల్,వన్‌బి మార్చడానికి సంబంధిత అధికారులు చేసిన విచారణ వివరాలు తెలపాలని డిమాండ్ చేశారు. అలాగే మూగమానుగుందిలోని సర్వేనంబర్ 101/ఎ విస్తీర్ణంలో 8.40ఎకరాల భూమిలో 4.20ఎకరాల భూమి అదే గ్రామానికి చెందిన ఇతరులు ఆక్రమించుకున్నారని అది తమ పెద్దలు సంపాదించిన భూమి అని గతంలో తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని అయితే వారి వద్ద నుండి లంచం తీసుకుని అధికారులు అక్రమంగా ఆన్‌లైన్,అడంగల్ వారు పేరుపైకి మార్చారని ఆరోపించారు. ప్రస్తుతం వారు పొలాన్ని సాగు చేస్తున్నారని అడిగితే మాకు రిజిస్టర్ డాక్యుమెంట్లు ఉన్నాయని దబాయిస్తున్నాయన్నారు. మండలంలో ఓ అధికారి మూల సూత్రదారిగా తమకు సంబంధించిన భూమి వారి పేరుపైకి మారిందని అమాయకులు నిరక్షరాస్యులైన దళిత రైతులను మోసం చేసి అన్యాయం చేశారని భాదిత మహిళా రైతులు ఆ అధికారిపై గొడవకు దిగారు. బయటకు రావాలని సమాధానం చెప్పాలని కార్యాలయం వాకిలి ముందు బైఠాయించి నినాదాలు చేశారు. లక్షల రూపాయల లంచాలు తీసుకుంటూ పేదలకు అన్యాయం చేస్తున్నారని రైతుల భూములను ఇతరుల పేర్లు పైకి మారుస్తూ రైతులను కష్టాల పాలు చేస్తున్న అధికారులను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భాదితులకు న్యాయం జరిగిన పక్షంలో రెవెన్యూ అధికారుల అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా రికార్డులు పరిశీలించి భాదితులకు న్యాయం చేస్తామన్నారు.

## 16 నెలల బాలునికి అత్యంత క్లిష్టమైన అపరేషన్ విజయవంతం



**నంద్యాల, జూలై 26, ప్రభాతవార్త ప్రతినిధి:** 16 నెలల బాలుడు అయాసంతో బాధపడుతుండగా బాబు తల్లిదండ్రులు చాల అసుపత్రుల్లో చూపించారు. అయినా బాబు అయాసం తగ్గలేదు. దాంతో బాబు తల్లిదండ్రులకు శాంతి రాం అసుపత్రికి వెళ్లమని కొందరు సూచించారు. దాంతో బాబు తల్లిదండ్రులు శాంతిరాం ఆసుపత్రి నందు పిడియాట్రిక్ సర్జన్ డా.రవీందర్‌ను కలువడం జరిగింది. డాక్టర్ సూచన మేరకు ఎక్స్ రే, సిటిస్కాన్ తీయించారు. అందులో బాబుకు ఉపిరితిత్తుల్లో గడ్డ ఉందని తెలిసింది. ఊపిరితిత్తుల అపరేషన్ చేయడం అత్యంత క్లిష్టమైన అపరేషన్‌ను ఒక టీమ్‌గా చేయడం జరిగింది. ఈ అపరేషన్ 3 గంటలకు పైగా చేయడం జరిగింది. అపరేషన్ చేసిన వైద్యులు పిడియాట్రిక్ సర్జన్ డా.రవీందర్, సిటివిఎస్ సర్జన్ డా.మురళీ హరిష్, మరియు కార్డియాక్ అనస్థియాసిస్టు డా.చెన్నకేశవ అధ్వర్యంలో అపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేశారు. ఈఅపరేషన్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు అవుతుంది. కానీ శాంతిరామ్ అసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అపరేషన్‌చేయడం జరిగింది. త్వరగా కోలుకున్న బాలున్ని శుక్రవారం డిశ్చార్జీ చేయడం జరిగింది.

## గోనెగండ్లను చేరిన ఎల్లెల్సీ నీరు

**- కోడుమూరు తాగునీటికి విడుదల**

**- గోనెగండ్ల,అలువాల ఎస్ఎస్ ట్యాంక్‌లకు,కుంటలకు నీరు విడుదల**



**గోనెగండ్ల జూలై 26 ప్రభాతవార్త**

గోనెగండ్ల సెక్షన్‌కు ఎల్లెల్సీ నీరు శుక్రవారం మధ్యహ్నాం చేరాయి.ఎమ్మిగనూరు నుంచి గోనెగండ్లకు 130 క్యూసెక్కుల నీరు చేరినట్లు ఎల్లెల్సీ ఏఈ ఉదయ్‌భాస్కర్,వర్క్ఇన్స్‌పెక్టర్ అర్జున్ తెలిపారు.గోనెగండ్లకు చేరిన నీటిని గోనెగండ్ల,అలువాల ఎస్ఎస్ ట్యాంక్‌లకు నీటి కుంటలకు విడుదల చేశారు.అలాగే తాగునీటి అవసరాలకు ముందు ప్రియార్టి ఇస్తునట్లు తెలిపారు.మిగిలిన నీటిని మొత్తం కోడుమూరుకు మళ్లించారు.కోడుమూరు లో గత కొని న్న వారాలుగా తాగునీటి సమస్య తీవ్రమైంది.దాంతో విడుతలైన నీటిని కోడుమూరు తాగునీటి అవసరాలకు మళ్లించినట్లు వారు తెలిపారు.

## ఉపాధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**బేతంచెర్ల, జూలై 26, ప్రభాతవార్త:**

మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామ పంచాయతీ మజరా గ్రామమైన బలపాలపల్లె గ్రామంలో రైతు మునిస్వామి పొలంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పండ్ల తోటల పెంపకంలో భాగంగా మామిడి మొక్కలు నాటుటకు అవసరమైన తవ్విన గుంతలు కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పనుల కొలతలు, సమయపాలన, సగటు వేతనం గురించి తెలియజేయడంతోపాటు జాబ్‌కార్డు తీసుకున్న ప్రతి ఉపాధి కుటుంబం రూ.300వేతనంతో ఖచ్చితంగా 100 రోజులు పని చేసుకోవాలని ఉపాధి కూలీలకు కలెక్టర్ సూచించారు. అనంతరం రైతు పొలంలో కలెక్టర్ మామిడి మొక్కను నాటారు. అలాగే కొలుములపల్లె గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న రైతు వెంకటరెడ్డి పొలంను కలెక్టర్ పరిశీలించి రోగనిరోధక శక్తిని పెంచే ఇలాంటి పండ్ల తోటల సాగు పై ప్రతి రైతు ఆసక్తి పెంచుకోవాని ఆమె సూచించారు. అలాగే తవిసికొండ గ్రామంలో స్టాగర్డ్ ట్రెంచ్ పనులను పరిశీలించి కూలీలు సరియైన కొలతలతో పనులు చేసి ప్రభుత్వం నిర్ణయించిన మేరకు వేతనం పొందాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, ఏపీడీ బాలాజీ నాయక్, ఈవోఆర్డీ వెంకట రంగనాయక్, గ్రామ సర్పంచ్, ఎంపిటిసి మరియు గ్రామ పెద్దలు, ఉపాధిహామీ ఏపీవో, కోర్సు డైరెక్టర్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ , టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్, ఉపాధిహామీ కూలీలు, మేటీలు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ వెనకబాటుతనాన్ని ప్రధానికి వివరించి సఫలీకృతులైన చంద్రబాబు



**కర్నూలు హాస్పిటల్, జూలై 26, ప్రభాతవార్త:** అర్థాకలి, ఆత్మహత్యలు, అప్పులకు నిలయంగా మారిన రాయలసీమ వెనుకబాటు తనాన్ని రూపుమాపేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారాచంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రణాళికను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని అందుకు అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాయలసీమకు, ముఖ్యంగా కర్నూలు జిల్లా ఓర్వకలు పారిశ్రామిక కారిడార్‌ను గుర్తించి నిధులను కేటాయించనున్నట్లు బడ్జెట్‌లో తెలియజేసినందుకు వారికి కర్నూలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు తనకున్న పాలన అనుభవంతో కర్నూలు జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారని గతంలో కూడ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లాకు ఎన్నో అబివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వాటిలో విత్తనశుద్ధి, సోలార్ హాబ్, ఎయిర్‌పోర్టు, ఉర్దువిశ్వ విద్యాలయం వంటివి అమలుకు నోచుకోవడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర గొ గ్రెల పెంపకందార్ల సమాఖ్య అధ్యక్షులు వై నాగేశ్వర్‌యాదవ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి నంద్యాల నాగేంద్ర, పోతురాజు, రవికుమార్, అకేపోగు వెంకటస్వామి, చంద్రశేఖర్, సత్రం రామకృష్ణుడు, పేరపోగు రాజు తదితరులు పాల్గొన్నారు.

## అప్రోచ్ రోడ్డు లేని గ్రామాలను గుర్తించండి : జిల్లా కలెక్టరు

**- పూర్తిగా దెబ్బతిన్న రోడ్ల వివరాలు తయారుచేయండి**



**కర్నూలు, జూలై 26, ప్రభాతవార్త:** స్వాత ంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు అప్రోచ్‌రోడ్లు లేని గ్రామాలను గుర్తించాలని జిల్లా కలెక్టరు రంజిత్‌బాషా పంచాయితీరాజ్ శాఖ అధికారులను అదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్‌అండ్ బి పంచాయితీ రాజ్ అధికారులతో రోడ్ల నిర్మాణంపై జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ఈసందర్బంగా కలెక్టరు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు అప్రోచ్‌రోడ్డు వేయని గ్రామాలు ఉంటే వాటిని గుర్తించాలని కలెక్టరు పంచాయితీ రాజ్ శాఖాధికారులను అదేశించారు. ఇందులో రెండు కిలోమీటర్ల లోపు రోడ్లు ఉంటే వాటిని ఎన్ఆర్ఈజిఎస్ కింద నిర్మిస్తామని తెలిపారు. ఆర్‌అండ్ బి కింద గుంతలు ఉన్న 39 రోడ్లకు మరమ్మత్తులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి మెయిటెన్స్ కింద నిధులు రాగానే ఈపనులను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టరు అదేశించారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా పూర్తిగా దెబ్బతిన్న రోడ్లను గుర్తించాలని కలెక్టరు ఆర్ అండ్ బి, పంచాయితీరాజ్ శాఖల అధికారులను అదేశించారు. ఇందులో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న రోడ్లను ప్రయారిటైజ్ చేయాలన్నారు. రాష్ట్రప్రభుత్వం నుండి నిధులు రాగానే ఫెస్-1 కింద పనులు మొదలు పెట్టాలన్నారు. కలెక్టరేట్ మరమ్మత్తులు చేసిన తరువాత కలెక్టరేట్ చుట్టుప్రక్కల చెత్త అదేవిధంగా ఉందని వెంటనే శుభ్రం చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా కలెక్టరేట్‌లో ఉన్న ఫౌంటెన్‌కు సంబంధించిన మరమ్మత్తుల పనులు కూడ వెంటనే చేయించాలని ఆర్ అండ్ బి అధికారులను అదేశించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బి ఎస్ఈ నాగరాజు, ఈఈ సురేష్, పంచాయితీ రాజ్ ఈఈ మద్దన్న, డిఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## బెంగుళూరు నుండి కర్నూలుకు విమాసర్వీసులు పునరుద్దరణ : యంపి

**: త్వరలో కర్నూలు నుండి విజయవాడకు**



**నంద్యాల, జూలై 26, ప్రభాతవార్త ప్రతినిధి:** బెంగుళూరునుండి కర్నూలు (ఓర్వకల్లు)కు విమాన సర్వీసులు పునరుద్దరణ జరుగుతున్నట్లు యంపి బైరెడ్డి శబరి తెలిపారు. శుక్రవారము యంపి మాట్లాడుతూ నంద్యాల జిల్లా పరిదిలోని ఓర్వకల్లు విమానశ్రయం నుంచి గతంలో ఇండిగో ఎయిర్‌లైన్సు విమాన సంస్థ బెంగులూరు నుండి కర్నూలు (ఓర్వకల్లు) సర్వీసు నడిచేదని కొన్ని అనివార్యకారణాల వల్ల అ విమాన సర్వీసు రద్దు అయిందన్నారు. దీనితో బెంగుళూరు నుండి కర్నూలకు వచ్చే విమాన ప్రయాని కులు ఇబ్బంది పడుతున్నారని కేంద్రవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లడముతో బెంగుళూరు నుండి తీసుకెళ్లడముతో బెంగుళూరు నుండి కర్నూలకు విమాన సర్వీసును పునరుద్దరించిరుట్ల అమె తెలిపారు. ఈ సర్వీసు అగస్టు 16వ తేది నుండి సోమవారము, బుదవారము శ్రకవారములల్లో నడుస్తుందని శబరి చెప్పారు. కర్నూలు విమానాశ్రయం నుండి ప్రస్తుమతు చెన్నై న్టు కర్నూలు కర్నూలు టు వైజాగ్, విమాన సర్వీసులు నడుస్తున్నాయని అగస్టు 18నుండి బెంగుళూరుటు కర్నూలు నుండి బెంగుళూరుటు కర్నూలుకు విమాన సర్వీసులనడవ బోతున్నాయని అలాగే కర్నూలు నుండి విజయవాడకు విమాన ప్రయానికుల డిమాండు అదిక౦ముగా ఉందని ఈ సమస్యను కూడా కేంద్ర వియానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు వివరించగా కర్నూలుటు విజయవాడకు విమాన సర్వీసును అక్టోబరు నెలాఖరులోగా నడిపించేకు చర్యలు తీసుకుంటూమని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని అమె చెప్పారు.కర్నూలు విమానాశ్రయం అబివృద్ధికి కేంద్ర నుంచి విదులు రాబట్టేందుకు కృషి చేస్తున్నామని రన్ వే వుడల్పు పొడిగింపుకు రాత్రి వేళ్లలో విమానాలు ల్యాండు అయ్యేందుకు అవసరమయె ఓయ విద్యుధీకరణ పనులకు రూ 113 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వాటి మంజూరుకు కూడా కృషి చేస్తున్నామని శబరి వివరించారు.

## తక్షణ అవసరాల కొరకు రూ.1కోటి24లక్షలు మంజూరు



**ఆదోని, జూలై 26, ప్రభాతవార్త**

ఆదోని పురపాలక సంఘానికి తక్షణ అవసరాల కొరకు రూ.1కోటి24లక్షలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. శుక్రవారం పురపాలక శాఖ మంత్రి నారాయణని కలిసి ఆదోని పురపాలక సంఘం పరిధిలోని విస్తరణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి రూ.44కోట్ల నిధులు అవసరమని కోరారు. పట్టణంలోని విస్తరణ ఏరియాలలో ప్రజలకు కనీస అవసరాలైన మురుగు కాలువలు,రోడ్లు,పైపులైన్లు,సిసిరోడ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారని వారి సౌకర్యార్థమై ప్రత్యేక నిధులను మంజూరు చేయించాల్సిందిగా మంత్రిని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి తక్షణ అవసరాల కోసం రూ.1కోటి24లక్షలను మంజూరు చేసినట్లు తెలిపారు.

## అటోలారీ డీ డ్రైవరు మృతి



**నంద్యాల,జూలై 26,ప్రభాతవార్తప్రతినిధి**

నంద్యాల జిల్లా జాతీయ రహదారిలో శిరువెల్ల మెట్ట వద్ద లారీ అటో డీ కొట్టుకోవడముతో అటో డ్రైవరు అక్కడిక్కడే మృతి చెందినట్టు శిరువెల్ల యస్ఐ సురేష్ చెప్పారు. అయన తెలిపిన వివరాల మేరకు శుక్రవరాము కూలీడ్రింక్ లోడుతో కోవెలకుంట్ల వైపు నుండి శిరువెళ్ల వైపు వెల్లుతున్న అటోను లారీ డీకొట్టిందని అయన చెప్పారు. ఈప్రమాదములోఅటో డ్రైవరు నాగేంద్ర అక్కడిక్కడే మృతి చెందాడని చెప్పారు. మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యస్ఐ సురేష్ చెప్పారు.

## ఆలూరు నియోజకవర్గ.. అభివృద్ధే నా లక్ష్యం..!

**- ఆలూరు తెదేపా ఇంచార్జ్ వీరభద్రగౌడ్**



**ఆలూరు,జూలై 26,ప్రభాతవార్త :** ఆలూరు నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యమని ఆలూరు తెదేపా ఇంచార్జ్ వీరభద్రగౌడ్ అన్నారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆలూరు ఇంచార్జ్ వీరభద్రగౌడ్ విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిసి ఆలూరు నియోజకవర్గం వేదావతి, నగరడోన రిజర్వాయర్ సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నియోజకవర్గంలోని రోడ్లు,తాగునీటి సమస్యలు పరిష్కరించాలని సిఎం చంద్రబాబును కోరినట్లు తెలిపారు.

# విద్యార్థులకు ఉన్నత చదువుల్లో పోటీతత్వం ఉండాలి




**కోడుమూరు, జూలై 26, ప్రభాతవార్త :** విద్యార్థి దశ నుంచి విద్యార్థులకు పోటీతత్వంను అలవాటు చేసుకుంటే భవిషత్‌లో ఉన్నత చదువుల్లో రాణిస్తారని కోడుమూరు ఎస్.ఐ బాలనరసింహులు ఉద్బోదించారు. శుక్రవారం స్థానిక కెవిఆర్ జూనియర్ కళాశాలల్లో జరిగిన స్వాగతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో మహోన్నత మైందన్నారు. ఈ దశ నుంచే విద్యార్థులు ఉన్నత చదువులకు రాణించే అవకాశాలు ఉన్నాయని ఇప్పటి నుంచే విద్యార్థులు చదువుల్లో బాగా రాణించేందుకు ప్రయత్నించాలని ఆశాబావం వ్యక్తం చేశారు. ఇంటర్ చదువులే రాబోయే ఉన్నత చదువులకు ఎంతో దోహదపడుతాయన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని వీటిపై కూడా రాణించాలని చెప్పారు. అనంతరం కళాశాలల్లో ఇది వరకు సాధించిన ఘన విజయాలను గురించి కళాశాల ప్రిన్సిపాల్ గోట్ల శేఖర్‌ను అడిగి తెలుసుకొని విద్యార్థుల ప్రతిభాపాటవాలను అభినందించారు. ఈ కళాశాల ఏర్పాటు నుంచి ప్రతి ఏటా మంచి ర్యాంకులు సాధిస్తున్నారని శేఖర్ వెల్లడించారు. గత ఏడాదిలో జరిగిన పోటీ పరీక్షల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రవితేజ అనే విద్యార్థి 470కి 459 మార్కులు , అలాగే ప్రియాంక అనే విద్యార్థికి 440కి 429 మార్కులు సాధించిన వారిని కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తైమూర్‌భాష, కళాశాల కరస్పాండెంట్ ఎం.రవికుమార్, కళాశాల అధ్యాపక బృందం విజయ్‌కుమార్, బాలస్వామి, వీరేష్, నాగరాజు, సుదర్శన్, తిరుమల్, ఆంజినేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ధరఖాస్తులు ఆహ్వానం

**నంద్యాల విద్య, జూలై 26, ప్రభాతవార్త:** జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాల పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల కోసం విద్యాకమిషనరు విజయరామరాజు అధ్వర్యంలో ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆసక్తిగల వారు ఈనెల 26వ తేది నుంచి ఆగష్టు 5 వరకు ధరఖాస్తు చేసుకోవచ్చున్నారు. మండల పరిషత్ ఉపాధ్యాయులు ఎంఈఓ ద్వారా, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు డిప్యూటీ డిఈఓ ద్వారా తమ ప్రతిపాదనలను ఒరిజినల్ పత్రాలతో పాటు రెండు నకిలీ ప్రతులను సంబంధిత అధికారికి అందజేయాలని సూచించారు. అలాగే జిల్లాలోని అన్నియాజమాన్యాల ఉన్నత పాఠశాలల పరిధిలో ఉన్న 6 నుంచి 12 వరకు చదువుతున్న విద్యార్థులతో ప్రత్యేకమైన ప్రహారి క్లబ్‌లు (చిలర్డ్స్) ఏర్పాటు చేయాలని అందుకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిఈఓ ఆదేశించారు. ఈక్లబ్‌ల యొక్క ముఖ్య ఉద్దేశం పాఠశాల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ మరియు మాదకద్రవ్యాల అమ్మకాల నిషేధించడం వాటి వల్ల ఏర్పడే దుష్పరిణామాలు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలిపి చైతన్యపరచడం వంటి కార్యక్రమాలు చేపట్టెందుకు ఈ క్లబ్‌లు దోహదపడతాయని వీటిని ఖచ్చితంగా పాఠశాల పరిధిలో ఏర్పాటు చేయాలని సూచించారు.

## డిగ్రీ కళాశాల లెక్చరర్‌కు డాక్టరేట్



**నందికొట్కూరు, జూలై 26, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు శ్రీమతి తలత్‌పర్వీన్ భౌతిక శాస్త్రంలో అబ్జర్వేషన్ మరియు కంపారిజన్స్ ఆఫ్ వేరియేషన్ ఇన్ ఇన్స్టబిలిటి ఇన్‌డిసిస్ ఇన్ డిఫరెంట్ రీజన్స్ ఆఫ్ ఇండియా నేరుగా రేడియో సౌన్ డే డేటా అనే అంశంపై చేసిన పరిశోధనకు మౌలానా అజాద్ నేషనల్ ఉర్దు యూనివర్సిటీ హైదరాబాద్ వారు అధ్యాపకురాలుకి డాక్టరేట్ ప్రధానం చేసినట్లుగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.సునీత తెలిపారు. డాక్టరేట్ తలత్‌పర్వీన్ ప్రొఫెసర్ హెచ్ అలీమ్ భాషా పర్యవేక్షణలో పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినందుకు గాను ఆమెకు డాక్టరేట్ వచ్చిందని ఆమె తెలిపారు. శుక్రవారం కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఆమెను అభినంధించారు.

## మురుగునీటికి చోటు...తప్పదు దోమపోటు



**కర్నూలు మున్సిపల్, జూలై 26, ప్రభాతవార్త:** ఇంటి పరిసరాల్లో మురుగునీటికి చోటు ఇస్తే దోమపోటుకు గురికావాల్సి వస్తోందని నగర పాలక అదనపు కమిషనరు రామలింగేశ్వర్ అన్నారు. శుక్రవారం నగర వ్యాప్తంగా ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి సచివాలయ కార్యదర్శుల ద్వారా విస్తృత అవగాహన కల్పించినట్లు రామలింగేశ్వర్ పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, బాటిల్స్, కుండీలు, గచ్చు వంటి వాటిలో నిరుపయోగ నీటిని వెంటనే తొలగించాలని కోరారు. అలాగే వినియోగించే నీరుపై తప్పనిసరిగా మూత ఉంచాలని సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కమిషనరు రామలింగేశ్వర్ కోరారు.

## కార్గిల్ యుద్ధవీరులకు సత్కారం



**నంద్యాల విద్య, జూలై 26, ప్రభాతవార్త:** కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌ను తరిమికొట్టి వీరోచితంగా పోరాడి అమరులైన వీర సైనికులకు నంద్యాల లయన్స్‌క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్, కార్యదర్శి శిరిగిరి రమేష్‌లు నివాళ్లు అర్పించారు. ఐఎంఏ మాజీ అధ్యక్షులు డా.రవికృష్ణ, రవిప్రకాష్‌ల అధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికుల మియాజీ, లక్ష్మయ్యలను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 1999లో కార్గిల్ ప్రాంతాన్ని అక్రమించిన పాకిస్తాన్ సైనికులను తరిమికొట్టి విజయం సాధించిన ఈరోజును కార్గిల్ విజయదినోత్సవంగా పేర్కొంటున్నామన్నారు. సరిహద్దుల్లో అహర్నిశలు దేశాన్ని కాపాడుతున్న వీరజవాన్‌ల త్యాగాలు గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బార్డర్‌లో పనిచేసే సైనికులు నిద్రహారాలు మాని వారు విధులు నిర్వహించడంతోనే మనం హాయిగా నిద్రపోతున్నామని పేర్కొన్నారు. యుద్ధవీరులు మియాజీ, లక్ష్మయ్యలు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్నామని ఎందరో వీరుల ప్రాణత్యాగం వల్లే కార్గిల్‌ను మన అధీనంలోకి తెచ్చుకున్నామన్నారు. కార్య క్రమంలో శిరిగిర రమేష్, నిజాముద్దీన్, మామిళ్ళ నాగరాజు, పిట్టం వెంకట సుధాకర్‌రెడ్డి, సోమేసుల నాగరాజు, ఆంజనేయులు గుప్తా, డా.సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

## నేలకోసిగిలో పారిశుద్ధ్య పనులు..



**నేలకోసిగి(కోసిగి), జూలై 26, ప్రభాతవార్త :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా, ప్రతి ఒక్కరు పారిశుద్ధ్యం పట్ల భాగస్వాములు కావాలని ఇందు కోసం ప్రతి ఒక్కరుసహకరించాలని నేలకోసిగి గ్రామ సర్పంచ్ పశువుల హనుమంతమ్మ అన్నారు..ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరు మల్లికార్జునరెడ్డి సహకారంతోశుక్రవారం గ్రామంలో పారిశుద్ధ్య పనులను సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టారు..ఈ సందర్బంగా గ్రామంలోని పలు కాలనీలలో డ్రైనేజీలను, కాలువలను శుభ్రం చేయించారు..ముఖ్యంగా ఇళ్ల ముందు ఎలాంటి చెత్తా, చెదారం ఉండకుండా ఊరు బయట చెత్తను వేయాలన్నారు..మురికి కాలువల్లో పూడికను వేయరాదని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి గ్రామస్థుడు సహకరించాలన్నారు..ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మంచినీటిని కాచి వడబోసి తాగాలన్నారు.. దోమలు ప్రబలకుండా ఇళ్లల్లో దోమతెరలను వాడుకోవాలని, ఒకవేళ పొగలాంటివి పెట్టుకుని దోమలబారి నుండి రక్షణ పొందాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పశువుల లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శి వినోద్, తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా స్కిల్ అండ్ డిజిటల్ ఇన్సియేటివ్ డే వేడుకలు

**– జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో శిక్షసప్త: విద్యా వారోత్సవాలు**

ఫోటో నం. 26 గడివేముల 01, 01ఏ. ప్రయోగాలను ఏర్పాటు చేసిన విద్యార్థులు

గడివేముల, జూలై26, ప్రభాతవార్త; మండలంలోని గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాశాలలో శిక్ష సప్త: విద్యా వారోత్సవాల సందర్బంగా శుక్రవారంనాడు 5వ రోజు కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) ప్రవేశపెట్టి నాలుగవ వార్షికోత్సవం సందర్బంగా సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం చేపట్టారు. స్కిల్ అండ్ డిజిటల్ ఇన్సియేటివ్ దేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే విండ్ మిల్స్ ద్వారా ఫ్రీ ఆఫ్ ఎనర్జీ ప్రాజెక్ట్ తయారు చేయడం, బ్యాంకింగ్ రంగం తరగతి గదిలో స్కిల్స్ పెంచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జానపాటి రాజేంద్రప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, ఒకేషనల్ విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు అనిల్, శేషన్న, దస్తగిరమ్మ పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం

**పాములపాడు, జూలై 26, ప్రభాతవార్త:** మండలంలోని మద్దూరు గ్రామంలో హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేశారు. జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు డా.సునీత, జిల్లా డేటా మేనేజరు శివ, జిల్లా ప్రొగ్రామ్ అధికారి నజినిన్ రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా డా. సునీత మాట్లాడుతూ గర్భిణిలు, బాలింతలు, శిశువులకు అందించేసేవలు ఆన్‌లైన్‌లో నమోదు వివరాలను సమీక్షించి తగిన సూచనలు అందించారు. బడి పిల్లలకు, బడికి వెళ్ళని కిశోరబాలికలకు రక్తహీనత శాతాన్ని గతంలో చేసిన పరీక్షలను పరిశీలించారు. అలాగే క్షయ నివారణకు టీకా శాతాన్ని పెంచాలని, కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించి అనుమానితులను గుర్తించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలని అదేశించారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది అన్నమ్మ, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు కల్పించండి..

**కోసిగి, జూలై 26, ప్రభాతవార్త :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తమ గ్రామంలో పనులు కల్పించాలని చిర్తనకల్లు గ్రామస్తులు ఎంపీడీవోను కోరారు..గ్రామంలో పనులు లేకపోవడంతో తాము అందరు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు..ముఖ్యంగా గ్రామంలోవర్షాలు లేకపోవడంతో పనులు దొరకడం లేదని, కావున ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి పనులను కల్పించి తమ కుటుంబాలనుఆదుకోవాలని కోరారు.. అనంతరం గ్రామస్తులు వినతి పత్రంను అందించారు.. ఈ సందర్బంగా ఎంపీడీవో ప్రభావతి వెంటనేఉపాధి హామి పథకం ఏపివో చంద్రశేఖర్‌తో చర్చించారు.. వెంటనే పనులు కల్పించాలని ఎపివోకు ఆదేశించారు.. దీంతో ఎపివోగ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌ను విచారించి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళిక నివేదికలను సిద్ధం చేసి పనులుకల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.. దీంతో సోమవారం నుండి గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభిస్తామని చెప్పడంతోగ్రామస్తులు తిరిగి వెళ్లారు..

## విద్యార్థులకు అవగాహన సదస్సు

**ఆదోని, జూలై 26, ప్రభాతవార్త :** కేంద్రప్రభుత్వంచే ప్రారంభించబడిన ఈ వనరులు, డిజిటల్ వనరులు జాతీయ డిజిటల్ లైబ్రరీ, డెల్నెట్, ఇన్‌ఫ్లిబెంట్ ఆధ్వర్యంలో గ్రామీణ యువత కోసం ఏర్పాటు చేసిన సందర్భంగా శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ మురళీమోహన్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతకు ఇంటర్‌నెట్ సదుపాయం సరిగా ఉండదని కావున కేంద్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. దీంతో విద్యార్థులకు కావాల్సిన పాటలను నిష్ణాతుల ద్వారా నాలుగు పద్దతులలో భోదిస్తారన్నారు. వీడియో, ఆడియో, మెసేజ్, యానిమేషన్ రూపల్లో లభ్యమవుతాయని ఆయన వివరించారు. ఈ సదుపాయాన్ని అందరు వినియోగించుకోవాలని విద్యార్థులచే లింక్ ద్వారా ఎన్‌రోల్ చేయించారు. అధ్యాపకులు యుగంధర్‌రెడ్డి, లైబ్రేరియన్ వేణుగోపాల్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## తక్షణమే 77 జీఓ రద్దుచేయాలి

**– ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలి**

**– సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రైవేట్ కళాశాలలు నిరాకరణ**

**నంద్యాల విద్య, జూలై 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జీఓనం.77 రద్దుచేయాలని విద్యార్థుల పాలిట శాపంగా మారిందని రాష్ట్ర పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శిఖరం నరహరి, ఈశ్వరయ్య, మల్లిరెడ్డిలు రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి విన్నవించుకున్నారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా తల్లిదండ్రులైన నాగ సైదయ్య, ఉశేన్, సత్యనారాయణ, నంద్యాల జిల్లాకు చెందిన జయప్రకాష్, జవహార్‌నాయక్, శివశంకర్, చంద్రశేఖర్‌ల అధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ ప్రస్తావిస్తు వచ్చిన ఏడాదికే జారీచేసిన జీఓ ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. ప్రైవేట్ కళాశాలల్లో చదివే వారికి కొందరు ఫీజుల చెల్లింపు రద్దుచేయగా మరికొన్ని కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింప చేయాలని అనాటి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందక కళాశాలలోనే సర్టిఫికెట్లను ఉంచారు. పేద బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత చదువులు చదివే అవకాశాలను దూరం చేసే జీఓనం.77ను రద్దుచేయాలని కొత్త ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్, పీజీ మరియు సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి ఫీజు కల్పించాలని 2019-20 విద్యాసంవత్సరంలో ప్రైవేట్ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు.

## పంటల సాగు పొలాల పరిశీలన



**కోడుమూరు, జూలై 26, ప్రభాతవార్త :** కోడుమూరు మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట పొలాల క్షేత్రాలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ పరిశీలించారు. మండలంలోని వెంకటగిరి, గోరంట్ల గ్రామంలో సాగు చేసిన పత్తి పంటలను సాగు చేసిన రైతులతో వ్యవసాయ అధికార బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంటల సాగు చేసిన పంటల ఎదుగుదలకు తీసుకుంటున్న సశ్యరక్షణ చర్యలు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో రైతులు అధిక శాతం పత్తి, కొర్ర, కంది పంటలకు ఆశించిన చీడ పురుగుల నివారణకు వాడే మందుల వాడకాలను అడిగి తెలుసుకున్నారు. అంతే గాక ప్రతి ఒక రైతు పంటలకు పురుగు మందుల వాడకంలో పూత మందుతో పాటు తప్పని సరిగ వేప నూనెను తప్పని సరిగా స్ప్రే చేయించాలని సూచించారు. ఈ పర్యటనలో వ్యవసాయ బృందం కౌలట్ల, రాజేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు

**– డిగ్రీ చదివిన విద్యార్థులు నేడు ఇంటర్వ్యూకు హాజరు కావాలి**



**నంద్యాల విద్య, జూలై 26, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన నంద్యాల్లో నిరుద్యోగ యువతీ యువకులకు బహుల జాతీయ కంపెనీ అయిన ఆల్‌టెక్ టెక్నాలజీస్ చెన్నై బెంగుళూరు వారి ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.జి.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని వివేకానంద అడిటోరియంలో శనివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ, బిఎస్సీ, బిసిఏ, బిబిఏ, బికాం, బిటెక్ విద్యార్హత గల వారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు. 2020 నుంచి 2024 వరకు పాస్ అయిన విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు అర్హులు. వీరికి రూ.17 వేల వేతనం ఇవ్వబడుతుందన్నారు. ఇంటర్వ్యూలు గ్రూప్ డిస్కషన్, స్క్రీన్ టెస్టు, అపరేషన్ రౌండ్ అనే మూడు విభాగాల ద్వారా ఉంటుంది. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగ మేళాను ఉపయోగించుకొని ఉపాధి అవకాశాలు పొందాలని రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయే వ్యారు వారి విద్యార్హత పత్రాలు, బయోడెటా, అధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజు ఫోటోలు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బయ్య, డైరెక్టరు హేమంతరెడ్డి, మేనేజర్ ప్రగతిరెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి డా.యువిఎస్ కుమార్, కెఎస్ కుమార్‌లు పాల్గొన్నారు.

## ఎల్‌వి ప్రసాద్ హాస్పిటల్ ఆద్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



**ఆలూరు/హొళగుంద, జూలై 26, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన హొళగుందలోని శ్రీ బాపూజీ ఇం.మీ యుపి స్కూల్‌లో ఎల్‌వి ప్రసాద్ హాస్పిటల్ ఆద్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు బాపూజీ ఇం.మీ స్కూల్ కరస్పాండెంట్ లక్ష్మన్న తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ముఖ్యఅతిథులుగా ఎంఈఓ-1,2 సత్యనారాయణ, జగన్నాథంలు హాజరయ్యారు. విద్యాసప్తహీలో భాగంగా శ్రీ బాపూజీ స్కూల్ నందు 200మంది విద్యార్థులకు కంటి పరీక్షలు ఎల్‌వి ప్రసాద్ ఆద్వర్యంలో నిర్వహించి పిల్లలకు ఉచితంగా మందులు అందచేశారు. సమస్యలున్న వారికి అద్దాలు మరియు ఆపరేషన్‌లు అవసరమైతే ఉచితంగా చేస్తామని ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది రజియా తెలిపారు. ఈ సందర్బంగా ఎంఈఓలు మాట్లాడుతూ ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి వారు నిర్వహించిన ఈ అవకాశాన్ని ప్రతిఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు మంచిగా చదవాలన్నా..నడవాలన్నా..ఏ పనిచేయాలన్నా..జ్ఞానేంద్రియాల్లో ఒకటైన కళ్ల ప్రధాన భాగమన్నారు. విద్యార్థులు టివిలు, స్మార్ట్‌ఫోన్‌లు ఎక్కువగా చూడకూడదని సూచించారు. కరస్పాండెంట్ లక్ష్మన్న మాట్లాడుతూ తమ పాఠశాలలో ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి వారి ఆద్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చంద్రవతి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## తల్లిదండ్రులు చిన్న పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వరాదు

**– అంగన్వాడీ టీచర్ లక్ష్మిదేవి**



**పగిడ్యాల, జూలై 26, ప్రభాతవార్త :** తల్లిదండ్రులు చిన్న పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వరాదనీ అంగన్వాడీ టీచర్ పగడం లక్ష్మిదేవి అన్నారు. మండలకేంద్రమైన పగిడ్యాలలోని 6వ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్న పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర పగడం లక్ష్మిదేవి మాట్లాడుతూ చిన్నపిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వడం అంతమంచిదికాదుకనుకు వారికి ఇవ్వరాదన్నారు. పిల్లలను ఇంట్లో ఉన్నప్పుడు వారిని మంచిగా పిలువడం, మంచి మాటలు చెప్పడం, బందువులతో , బయటివారితో ఏలా వుండాలి, టీచర్లతో ఏలా మెలగాలనీ వారికి చిన్ననాటి నుండి మంచి అలవాట్లు నేర్పించాలన్నారు..ఇప్పుడు పరిస్థితులు ఏలా వున్నాయి వివరంగా వివరించాలనీ, ముఖ్యంగా ఆడపిల్లలను బాగా చదివించాలనీ, వారు భవిషత్తులో సొంత కాళ్లపై ఆధారపడి జీవించేవిధంగా తీర్చిదిద్దవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఎంతైనా బాధ్యత వుందనీ అంగన్వాడీ టీచర్ పగడం లక్ష్మిదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల తల్లులు మహిళలు పాల్గొన్నారు.

## ఇంచార్జ్ ఎంపిపిగా అద్దంకి ఎర్రనాగప్ప భాద్యతలు స్వీకరణ



**తుగ్గలి, జూలై 26, ప్రభాతవార్త :** తుగ్గలి మండల ఇంచార్జ్ ఎంపిపిగా అద్దంకి ఎర్రనాగప్ప శుక్రవారం భాధ్యతలు స్వీకరించారు. గతంలో వైసిపి నాయకులు ఎంపిపిగా పగిడిరాయి ఎంపిటిసి ఆదెమ్మ రెండున్నరేళ్ల ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. ఒప్పందం ప్రకారం ఎంపిపి ఆదెమ్మ రెండున్న సంవత్సరాల కాలం పూర్తి కావడంతో ఎంపిపి పదవికి రాజీనామా చేశారు. ఎంపిపి ఎన్నిక జరిగేంతవరకు వైస్ ఎంపిపి-2 అద్దంకి ఎర్ర నాగప్పను నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగానే తుగ్గలి మండలం ఇంచార్జ్ ఎంపిపిగా ఎర్ర నాగప్ప, ఎంపిడిఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో భాధ్యతలను చేపట్టారు. ఈ సందర్బంగా ఇంచార్జ్ ఎంపిపి అద్దంకి ఎర్రనాగప్ప మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కార మార్గం చూపుతానన్నారు. అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నాడు. భాధ్యతలు చేపట్టిన అనంతరం ఇంచార్జ్ ఎంపిపి అద్దంకి ఎర్రనాగప్పకు ఎంపిడిఓ విజయలక్ష్మి, ఏఓ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ రాంబ్రహ్మంతో కలిసి ఉపాధి హామీ సిబ్బంది పూలబొకే అందచేసి శాలువాలతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు తేరప్ప, ఏపిఓ రామకృష్ణ, ఈసి ప్రదీప్‌కుమార్, సిఓలు నరసింహులు, కాసిం, టిఏలు జిసి, ధనుంజయతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సంస్కృతిని పరిరక్షించే వ్యక్తులు నేటి సమాజానికి అవసరం..!

**– డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, తితిదే**



**దేవనకొండ, జూలై 26, ప్రభాతవార్త :** తరతరాల నుండి వస్తున్న సంస్కృతిని పరిరక్షించి ఈ దేశ పరంపరను కాపాడే వ్యక్తులు నేటి సమాజానికి ఎంతో అవసరముందని ధర్మ పోరాటానికి సిద్ధపడే మనస్తత్వాలు తయారు కావాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గుండ్లకొండ గ్రామంలో గత నాలుగురోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్బంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్బంగా నిర్వహించిన ముగింపు సభా కార్యక్రమంలో వారు ప్రవచించారు. మూడురోజుల పాటు శ్రీనివాస రామానుజదాసు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఈడిగ సుంకన్న, అనుమల ప్రకాష్‌గుప్త, కురువ మునిస్వామి, జి గిడ్డన్న, కె వెంకటరాముడు, రవిచంద్రారెడ్డి, బి అనంతయ్య, బి రంగప్ప, ఇ వెంకటేష్, జె శివ, లింగప్ప, బి నాగప్ప, వి తిరుపాలు, కె మల్లయ్య, కె భగవాన్ నారాయణ, ఎల్ జయరాముడు, జూటూరు రంగముని, బి కౌలుట్లతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులందరికి గ్రామ భక్త సమాజం అన్న సంతర్పణ చేశారు.

## బ్రిడ్జిపై అతి ప్రమాదకరమైన గుంత...



**మిడుతూరు, జూలై26, ప్రభాతవార్త;** మండలంలోని పీరుసాహెబ్‌పేట, కడుమూరు గ్రామాల మధ్య నాపరాతి గనుల సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జికి ఏర్పడిన గుంత అతి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో నిరంతరం ట్రాక్టర్లు, ఇతర వాహనాలు అధిక సంఖ్యలో తిరుగుతాయి. బ్రిడ్జిపై భారీగుంత ఏర్పడింది. అంతేగాకుండా ఈ బ్రిడ్జికి మద్దతుగా ఉన్న పక్కగోడకు చెందిన రాళ్లు కూడా అదుపు తప్పాయి. ఈ రహదారిపై భారీ వాహనాలు తిరిగితే బ్రిడ్జి పక్కగోడ కూడా బలహీనంగా ఉండడం వల్ల బ్రిడ్జి కుప్పకూలే ప్రమాదం కూడా పొంచి ఉంది. బ్రిడ్జి పైన పడిన గుంత వాహనదారులు గుర్తించలేని పరిస్థితిలో ఉంది. గుంత పైకి చిన్నగా కనబడుతున్న కింద చాలా వెడల్పుగా ఉంది. రాత్రి సమయంలో ఈ గుంత వాహనదారులకు కనిపించే పరిస్థితి లేనందున, ప్రాణాపాయ ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంది. కాబట్టి సంబంధిత అధికారులు బ్రిడ్జిని పరిశీలించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

## ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ సలహాదారులు



**తుగ్గలి, జూలై 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామ సచివాలయంలో ఆ గ్రామ సర్పంచ్ గౌరవ సలహాదారులు ఎస్ ప్రతాప్ యాదవ్ సచివాలయ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా గౌరవ సర్పంచ్ సలహాదారులు ఎస్ ప్రతాప్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకుని ఆధార్ కేంద్రాన్ని సచివాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బొందిమడుగుల గ్రామ పంచాయతీలోని లింగనేనిదొడ్డి, నునసరాళ్ల, నల్లగుండ్ల గ్రామాల ప్రజలు కొత్త ఆధార్ కార్డులు, ఆధార్ కార్డులు మార్పులు చేర్పులు వంటి సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, ముక్కపళ్ల హుసేన్, లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, సుదర్శన్, నడిపి హుసేన్, దుబ్బ కాశీం, వడ్డే వెంకటేష్, నేసే నాగేష్, మహమ్మద్, వడ్డే పులికొండ తదితరులు పాల్గొన్నారు.

## కార్గిల్ దివాస్ సందర్భంగా మాజీ సైనికులకు సన్మానం



**ఆదోని, జూలై 26, ప్రభాతవార్త :** కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా భారతీయ జనతా యువమోర్చ పట్టణ అధ్యక్షులు వై శ్రీకాంత్ అధ్యక్షతన మాజీ సైనికులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, బిజెపి నాయకులు విట్టా రమేష్ మాట్లాడుతూ దేశంలో ఉన్నటువంటి ప్రజలందరు సంతోషంగా ఉండడం కోసం కుటుంబానికి దూరంగా ఉంటూ ప్రాణ త్యాగానికి వెనుకాడకుండ విధులు నిర్వహించే వారే మన సైనికులని కొనియాడారు. బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్ మాట్లాడుతూ మాతృభూమి సేవలో పోరాడి అత్యంత కష్టమైన పనిచేసి కార్గిల్ యుద్ధాన్ని గెలిచిన సైనికులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాజీ సైనికుడు నాగరాజు మాట్లాడుతూ గతంలో కంటే ఇప్పుడు రక్షణ శాఖ మరింత శక్తివంతంగా తయారైందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి, యూనుస్ ఖాన్, భాస్కర్, కబీర్, గిరిబాబు, బిజెవైఎం నాయకులు శివరాజ్, వినోద్, మారుతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పి బిందు మాధవ్‌ను కలిసిన టిఎం రమేష్ మాదిగ



**తుగ్గలి, జూలై 26, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా నూతన ఎస్పిగా భాధ్యతలు చేపట్టిన ఎస్పి బిందు మాధవ్ ఐపిఎస్‌ను కర్నూలు నగరంలో ఎస్పి కార్యాలయం నందు ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టిఎం రమేష్ మాదిగ మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా టిఎం రమేష్ మాదిగ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన ఆదోని డివిజన్‌లో పెత్తందారి కులాలకు చెందిన అగ్రవర్ణాల వారు దళితులే లక్ష్యంగా కుల వివక్షత, అంటరానితనంతో దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు చేస్తున్నారన్నారు. దీంతో ఆదోని డివిజన్‌లోని దళితులపై దాడులపై ప్రత్యేకంగా నిఘా ఉంచి దళిత కాలనీలపై ప్రతి పోలీస్ హౌస్ ఆఫీసర్లను పర్యవేక్షణ జరిపి దాడులను నివారించాలని కోరడం జరిగిందన్నారు. అలాగే దళితులపై జరుగుతున్న దాడులను, అవమానాలను, వేధింపులను పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ నిర్లక్ష్యం చేయకుండ తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి భాదితులకు సత్వర న్యాయం చేయాలని జిల్లా ఎస్పిని కోరినట్లు తెలిపారు. ఎస్పి సానుకూలంగా స్పందించి దళితులపై దాడులు చేస్తున్న వారిని ఏమాత్రం ఉపేక్షించబోమని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ఎస్ కర్నూలు సిటీ ప్రెసిడెంట్ గోవిందు మాదిగ, జిల్లా అధ్యక్షుడు గిడ్డయ్య మాదిగ, నంద్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాదిగ, ఆలూరు, దేవనకొండ ఇంచార్జ్‌లు పెద్దరాజు మాదిగ, చెన్నకేశవులు మాదిగ, పత్తికొండ అధికార ప్రతినిధి రాజశేఖర్ మాదిగ, దేవనకొండ ప్రధాన కార్యదర్శి హరీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు



**చాగలమర్రి, జూలై 26, ప్రభాతవార్త:** గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ తులశమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో సర్పంచ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ గ్రామసభకు ఎంపిడివో సూర్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జ్ ఈవో తహీర్ హుస్సేన్‌లు మాట్లాడుతూ చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ ఓడీఎఫ్ ప్లస్ గ్రామంగా ఎంపికైతే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేస్తుందన్నారు. కావునా ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రత గురించి సచివాలయ సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ అప్‌డేట్ క్యాంపు గడువు పెంచాలి

**-ఏపి అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత**

**వెల్దుర్తి, జులై26, ప్రభాతవార్త :** మండలంలోని 4 సచివాలయాల్లో కర్నూలు జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న అప్‌డేట్ కార్యక్రమం మంచి కార్యక్రమమని ఏపి అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత అన్నారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు పుట్టినతేది సర్టిఫికెట్లు లేక, మార్పులు చేర్పుల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదన్నారు. బతుకుతెరువు కోసం చిన్నారుల తల్లితండ్రులు గ్రామంలో లేకుండా వలసలు వెళ్లారన్నారు. ఇంకా చాలా మంది ఆధార్ అప్‌డేట్లు చేయించుకోలేదన్నారు. ఈ విషయాలను జిల్లా అధికారులు గమనించి మరికొన్ని రోజులు ఈ క్యాంపును కొనసాగించాలని, గడువు పెంచాలని ఆమె కోరారు.

## కార్గిల్ యుద్ధ వీరులకు జోహార్లు



**కర్నూలు హాస్పిటల్, జూలై 26, ప్రభాతవార్త:** చెన్నమ్మసర్కిల్‌లో టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి పార్టీల అధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్ జూలై 26 1999 మనదేశాన్ని రక్షించడానికి వీరోచితంగా పోరాడి దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన సైనిక అమరవీరులను స్మరించుకుంటూ వారికి కాగడాల ప్రదర్శనతో ఘన నివాళ్లు అర్పిస్తున్న టిడిపి సీనియర్ నాయకులు నందికోట్కూరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జీ గౌరు వెంకటరెడ్డిలు ఈకార్యక్రమంలో మాజీ సింగిల్ విండో ప్రసిడెంట్ ఎన్వీ రామకృష్ణ, పి మాదన్న, ఫిరోజ్, ఖాజామియా, రవిప్రకాష్‌రెడ్డి, పొలిరెడ్డి, సులేమాన్, బిజెపి నాయకులు సోమశేఖర్‌రెడ్డి, రాకేశ్వర్‌రెడ్డి, బీరప్ప మదనమోహన అచారి, రవి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బిసి హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



**మంత్రాలయం, జూలై 26, ప్రభాతవార్త:** నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో ఉన్న బిసి హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తగరం థామస్ అన్నారు. శుక్రవారం మంత్రాలయంలో ఉన్న బిసి హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ బిసి హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో అధికారులు తీవ్రంగా విఫలమయ్యారన్నారు. ఈ హాస్టల్‌కు వార్డన్ ఎవరో ఎవరికి తెలియదన్నారు. ఎప్పుడుహాస్టల్‌కు వస్తాడో, ఎప్పుడు వెళతాడో వారికే తెలియాలన్నారు. హాస్టల్‌లో మౌళిక వసతులు కరువయ్యాయన్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేవన్నారు. హాస్టల్‌కు ప్రహారీగోడ లేకపోవండతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నట్లు పేర్కొన్నారు. కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి, రాజు, వీరేష్, రాము, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## నివేదికను జిల్లా అధికారులకు అందచేస్తాం..!



**హొళగుంద, జూలై 26, ప్రభాతవార్త :** ఈఓపిఆర్‌డిపై వచ్చిన ఆరోపణలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు అందచేసి చర్యలు తీసుకుంటామని డిఎల్‌పిఓ నూర్జహాన్, ఎంపిడిఓ ఆజాద్‌లు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన హొళగుందలోని ఎంపిడిఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా ఈఓపిఆర్‌డి చంద్రమౌనేశ్వరగౌడ్‌పై కొన్ని పత్రికల్లో వచ్చిన ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని శుక్రవారం విచారణ చేపట్టినట్లు తెలిపారు. హొళగుందలో విచారణ చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నామని తెలిపారు. అలాగే ఆగస్టు 8వ తేదీ వరకు ప్రతి గ్రామంలో పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతిఒక్క అధికారి తమ తమ పరిధిలో సమయపాలన పాటించాలని సూచించారు. సమయపాలన పాటించకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అలాగే మండల ప్రజలంతా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు కలిసి పారిశుద్ధ్య పనులు, వీధిలైట్లు, తాగునీటి పైప్‌లైన్ లీకేజీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హొళగుంద గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రంగస్వామి, షఫీవుల్లా, సర్పంచ్‌లు చలవాది రంగమ్మ, హేసానుల్లా, వెంకటరామిరెడ్డి, వెంకటరెడ్డి, నెరణికి, హొళగుంద సర్పంచ్‌ల తనయులు సోమప్ప, పంపాపతి, వందవాగిలి సర్పంచ్ భర్త శేషప్ప తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి ఇంచార్జ్ ఎంపిపిగా రంగయ్య ఎన్నిక



**వెల్దుర్తి, జులై26, ప్రభాతవార్త :** వైఎస్ ఎంపిపిగా ఉన్న రంగయ్యను వెల్దుర్తి ఇంచార్జ్ ఎంపిపిగా ఎన్నుకున్నట్లు ఎంపిడిఓ శివశంకరప్ప తెలిపారు. ఇంతకు ముందు ఉన్న ఎంపిపి రాజీనామా చేయడంతో వైఎస్ ఎంపిపి-1గా ఉన్న రంగయ్యను జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎన్నుకొని శుక్రవారం ఎంపిపి స్థానంలో కూర్చోబెట్టి పదవీబాధ్యతలు అప్పజెప్పామన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన రంగయ్యను మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి, జడ్పీటిసి దాదిపోగు సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజదేవరాజ్, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ వైకాపా కార్యదర్శి వెంకటనాయుడు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు యల్లస్వామితదితరులు పూలమాల వేస శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రంగయ్యను వారు శుభాకాంక్షలు తెలిపారు.

## వైద్యుల పనితీరు పై విచారణ



**చాగలమర్రి, జూలై 26, ప్రభాతవార్త:** చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు ఇమ్రాన్, అంజలి పనితీరు పై శుక్రవారం అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో శారదబాయి బృందం అధికారులతో విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యులు నిర్వహిస్తున్న విధుల పై వేరు వేరుగా విచారణ చేశారు. 13వ సచివాలయ పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్‌టెక్నిషియన్లు, ఫార్మసిస్టులతో విడి విడిగా విచారణ చేపట్టి వారి అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా తీసుకున్నారు. విచారణ నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు. ఆప్తాలజిస్ట్ మాధవీలత, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల సాగు పై అవగాహన



చాగలమర్రి, జూలై 26, ప్రభాతవార్త: మండలంలోని నేలంపాడు గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యాన పంటల పై ఆ గ్రామ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ ఏపీవో నిర్మల మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద 350 ఎకరాల్లో ఉద్యాన పంటలకు సాగుకుగాను 146 ఎకరాల్లో సాగు రైతులను గుర్తించామన్నారు. 5 ఎకరాల్లోపు సన్నా, చిన్నకారు రైతులు 16 రకాల పండ్ల తోటల సాగుకు అవకాశం ఉందన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా వందశాతం సబ్సిడీతో రైతులు పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల రైతుల తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, జాబ్‌కార్డుతో ఎంపిడివో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి, ఉపాధిహామీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సంఘాల నాయకులపై చర్యలు తీసుకోవాలి - ఆర్జేడికి ఫిర్యాదు



**నంద్యాల విద్య, జూలై 26, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాలలకు గైర్హాజరవుతూ వాటిని ఓడిలుగా మార్చుకుంటూ బదిలీల్లో మోసాలకు పాల్పడుతున్నారని గతంలో విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రాయలసీమ ఆర్జేడికి జిల్లా బిటిఎఫ్ అధ్యక్షులు సతీష్‌కుమార్ శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈవిషయాలపై కర్నూలు, నంద్యాల డిఈఓలకు గతంలో ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోలేదన్న ఉపాధ్యాయ సంఘాల జేఏసి నంద్యాల పేరుతో ఒక అడ్రస్‌లేని ఫిర్యాదుపై ఎలాంటి విచారణ లేకుండా నన్ను సస్పెండ్ చేయడమే కాకుండా ఉద్యోగం నుండి తొలగించారని పేర్కొన్నారు. పోస్టల్ అడ్రస్‌తో కలిగిన బిటిఎఫ్ సంఘం ఫిర్యాదుపై అధికారులు విచారణ చేయకుండా కాలయాపన చేయడం ఇందులో అంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఆర్జేడి విచారణ పూర్తిచేయాలని అదేశించినప్పటికి రెండు నెలల పూర్తికావస్తున్న విచారణ చేయలేదని పేర్కొన్నారు. తక్షణమే బహిరంగ విచారణ నిర్వహించాలని కడప ఆర్జేడికి వినతిపత్రాన్ని అందజేశారు.

## 28న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**వెలుగోడు, జూలై 26, ప్రభాతవార్త:** ఈనెల 28న వెలుగోడులో ఎస్ఎన్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన 1985-88 సంవత్సరానికి సంబంధించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామచంద్రమూర్తి, బండి శేషన్న, వెంకట్, జయరామిరెడ్డిలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఇప్పటికే తమ తోటి విద్యార్థులతో సంప్రదింపులు, సమావేశాలు జరిపి ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1985-88 సంవత్సరం వరకు చదువుకున్న విద్యార్థులు సమావేశానికి ఉపాధ్యాయులను గౌరవించుకోవాలని సూచించారు.

## విద్యారంగ పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలి

**గోనెగండ్ల జూలై 25 ప్రభాతవార్త :** ప్రభుత్వం విద్యారంగ పరిరక్షణ కోసం తగు చర్యలు వెంటనే తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. విద్యా రంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఏపీ ఐక్యఉపాధ్యాయ ఫేడరేషన్ నాయకులు గురువారం గోనెగండ్లలోని ఎంపీడీవో సోనిబాయికి, తహశీల్దార్ పార్వతికి, ఎంఈవో రామాంజినేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను విచ్చినం చేస్తు తీసుకువచ్చిన జీవో నెం.117ను వెంటనే రద్దు చేయాలని ప్రాథమిక పాఠశాలలను యధావిదిగా కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానం తీసుకురావాలన్నారు. ఎంటీస్ ఉపాధ్యాయులను రెగ్యూలర్ చేయాలని, తదితర 20 డిమాండ్‌లను ప్రభుత్వ పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మద్దిలేటి, చంద్రపాల్, రాముడు, వెంకటరమణ, అక్బర్, నాగేశ్వరరావు, బాబు, లక్ష్మణ్ సంకున్న తదితరులు పాల్గొన్నారు.

## మెను ప్రకారం భోజనం చేయక పోతే కఠిన చర్యలు

**గోనెగండ్ల జూలై 25 ప్రభాతవార్త :** కస్తూరీ భా పాఠశాలలో నిర్వాహకులు మెను ప్రకారం భోజనం చేయక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ డైరెక్టర్ శ్యాముల్‌పాల్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని కస్తూరి భా పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యబోధన ఎలా సాగుతుంది. మెను ప్రకారం మంచి భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు బాగా చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఇప్పటి నుంచే విద్యార్థులు కష్ట పడి చదవాలని కోరారు. ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం చిన్నమర్రివీడు గ్రామానికి చెందిన బోయ సింధు అనే అమ్మయిని కస్తూరీ భా పాఠశాలలో కలెక్టర్ స్పెషల్ పర్మిషన్ కింద చేర్పించారు. సింధూ వారంలో మూడు రోజులు బడికి నాలుగు రోజుల కూలీ పనికి పోతున్నట్లు సమాచారం తెలుసుకొని ఆ బాలికను కస్తూరీ భా పాఠశాలలో చేర్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రామాంజినేయులు, నీలకంఠ, కస్తూరీ భా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

**:-మండల వ్యవసాయాధికారి గణేష్**



**మాధవరం(మంత్రాలయం), జూలై 26, ప్రభాతవార్త:** మండలంలోని ఎరువుల డీలర్లు ఎరువులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి జీరా గణేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఉన్న ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులస్టాకును పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం అంతర్రాష్ట చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధవరంలో ఉన్న అన్ని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశామన్నారు. అనుమతికి మించి ఎరువులను నిల్వవుంచితే సీజ్ చేస్తామన్నారు. ఎరువులను కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తే సహించేది లేదన్నారు. వారి లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

## జింకల బారి నుండి రైతులను కాపాడండి



**దేవనకొండ, జూలై 26, ప్రభాతవార్త :** జింకల బారి నుండి రైతులను కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, రైతుసంఘం మండల కార్యదర్శి సూరి, అశోక్, వ్యవసాయ కమీషన్ మండల కార్యదర్శి మహబూబ్‌భాష, నాయకులు గాజుల శ్రీనివాసులు, యూసుఫ్ భాషలు అన్నారు. శుక్రవారం మండల తహశీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుంకనూరు, పొట్లపాడు, బెల్లందొడ్డి, అలారుదిన్నె, కొత్తపేట, పుల్లాపురం, దేవనకొండ, తెర్నేకల్ తదితర గ్రామాల్లో జింకలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ రైతుల పంట పొలాలను నాశనం చేస్తున్నాయన్నారు. ఎంతో ఆశతో ఖరీఫ్ సీజన్ ప్రారంభించిన రైతన్నలకు జింకల రూపంలో తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారన్నారు. వేరుశనగ, పత్తి, టమోటా, మిరప తదితర పంటలపై జింకలు దాడి చేస్తూ పంటలను సర్వనాశనం చేస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నాయన్నారు. సంబంధిత అటవీ శాఖ ఉన్నతాధికారులు చర్చించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జింకల పార్కు ఏర్పాటు చేయాలని కోరారు.

## వైభవంగా కౌడే పీర్ల వేడుకలు



**పెద్దకడుబూరు, జూలై 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మేకడోన, నౌలకల్, కల్లుకుంట గ్రామాల్లో వెలసిన కౌడే పీర్ల వేడుకలు ఆయా గ్రామాల ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. శుక్రవారం సాయంత్రం కౌడే పీర్ల దేవుళ్లను ప్రధాన రోడ్ల వెంబడి ఊరేగిస్తూ భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ చివరివరకు వేలాదిమంది భక్తులు దేవుళ్ల వెంట నడుస్తూ ఏటికి తీసుకెళ్లారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అలాయ్ ఆడుతూ గ్రామస్తులను ఆకట్టుకున్నారు. పీర్ల దేవుళ్లను టిడిపి, వైసిపి నాయకులు దర్శించుకున్నారు. ఈ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ ఎస్ఐ మహేష్‌కుమార్ ఆద్వర్యంలో మూడు గ్రామాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## జాగ్రత్తలు పాటించి నష్టాన్ని నివారించుకోవాలి

**కొత్తపల్లి, జూలై 26, ప్రభాతవార్త:** గురువారం కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు జాగ్రత్తలు పాటించి నష్టాన్ని నివారించుకోవాలని మండల ఉద్యాన అధికారిని కె చందన్న అన్నారు. శుక్రవారం మండలంలోని ముసలమడుగు గ్రామంలో గతవారం కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మునగ పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల కారణంగా మునగ పంటలో తెగులు వ్యాపించడం జరిగిందన్నారు. వర్షం కురిసి అగిన తరువాత రైతులు పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాపర్ అక్సిక్లోరైడ్ మూడు గ్రాములు ఒక లీటర్ నీటికి చొప్పున మొక్కల మొదలలో పోసుకోవాలన్నారు. కాండం, కుళ్ల తెగులు నివారణ కోసం రీడోమిల్ గోల్డ్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటికి చొప్పున మొక్క పైకాండం బాగా తడిచేతట్టుగా పిచికారి చేసుకోవాలన్నారు. చనిపోయిన మొక్కలను తొలగించి వాటిని కాల్చివేయాలన్నారు. రైతులు సస్యరక్షణ పద్దతులు పాటించి నష్టాన్ని నివారించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రవీంద్ర నాయక్ మరియు రైతులు పాల్గొన్నారు.

## శిక్షసప్తహ్‌లో నైపుణ్యాల ప్రదర్శన



**చాగలమర్రి, జూలై 26, ప్రభాతవార్త:** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కోటయ్య ఆధ్వర్యంలో శిక్షసప్తహ్‌లో భాగంగా ఐదవ రోజు విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన అంశాల పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిత్రలేఖనం ద్వారా తయారుచేసిన వాటిని ప్రదర్శించారు. అనంతరం ఐటీ ఉపాధ్యాయుడు బాలయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాల అభివృద్ధి పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. పేపర్‌తో పడవలు తయారు చేయడం, రంగు పేపర్‌తో రకరకాల డిజైన్లు కత్తిరించి బొమ్మలు తయారుచేయడం, బుట్టలు, సంచులు వంటి అల్లికలు నేర్చుకోవడం, డ్రాయింగ్ వేయడం, చిత్రపటాలను గీయడం లాంటి వాటిని నేర్చుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలను అనారోగ్యాలకు గురికాకుండ కాపాడాలి



**ఆలూరు,జూలై 26,ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధులకు అనుగుణంగా గ్రామాలలో ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండ వారిని కాపాడాల్సిన భాద్యత ఆయా గ్రామాల సంబంధిత అధికారులపై ఉందని,హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు యూనిట్-3స్పెషల్ కలెక్టర్ కె విశ్వనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన చిప్పగిరిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్యుల పనితీరు,సిబ్బంది పనితీరు,ఈ సీజన్‌లో ఎన్ని జ్వరాల కేసులు వున్నాయి,డయేరియా ,మలేరియా,టైఫాయిడ్,డెంగ్యూ వివరాలను తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులకు అనుగుణంగా ప్రజలకు స్థానికంగా అందుబాటులో ఉండే నిబంధనల మేరకు చికిత్సలు అందించాలని ఆదేశించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో స్పెషల్ కలెక్టర్ సమావేశం నిర్వహించి సీజనల్ వ్యాధులు సోకకుండ ప్రజలు వాటి బారిన పడకుండ వారిని ఆరోగ్యవంతులుగా అవగాహన కల్పించి తీర్చిదిద్దాల్సిన భాద్యత ఆయా గ్రామాల అధికారులపై ఉందన్నారు. అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడి ప్రజలకు అంకితభావంతో గ్రామాలలో సేవలు చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. అప్పుడే ప్రభుత్వానికి మనకు స్థానికంగా ప్రజలలో మంచి పేరు గౌరవం ఉంటుందన్నారు. అలాకాకుండ నిబంధనలకు విరుద్ధంగా సమయపాలన పాటించకుండ ఇష్టానుసారంగా విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి గ్రామంలో రోజు శానిటేషన్ చేయించాలని,నీరు నిల్వ ఉండకుండ బ్లీచింగ్ పౌడర్ చల్లించి పారిశుద్ధ్య పనులు చేయించాలన్నారు. మంచినీటి కొళాయిలను శుభ్రం చేయించాలన్నారు. ఇలాంటివి చేయకుంటే సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడే ప్రమాదం ఉందన్నారు. దీంతో ప్రతిఒక్క అధికారి అప్రమత్తంగా అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. చిప్పగిరి బస్టాండ్,హోటల్ వద్ద ఏరూరు రోడ్డులో మురికి నీరు నిల్వ ఉండడంతో వాటి పనులను స్పెషల్ కలెక్టర్ దగ్గరుండి పంచాయతీ సిబ్బందితో చేయించారు. అనంతరం హోటల్ యజమానితో మాట్లాడుతూ హోటల్‌లోని నీళ్లు రోడ్లపైకి వదలకూడదని సూచించారు. తదనంతరం చిప్పగిరి జడ్‌పిహెచ్ పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజన నిర్వాహకులు భోజనం తయారు చేసే సమయంలో పాత్రలను శుభ్రం చేసి,నీటిని ట్యాంకును శుభ్రం చేసి తగు చర్యలు తీసుకుని భోజనాన్ని తయారు చేయాలని,విద్యార్థులు అనారోగ్యాలకు గురి కాకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఆరోగ్య సమస్యలు ఎదురైనా సంబంధిత ఉపాధ్యాయులు వెంటనే చర్యలు తీసుకుని చికిత్సలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు,ఇంచార్జ ఈఓపిఆర్‌డి బాలన్న,సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, ఇంచార్జ హెచ్ఎం పద్మావతి,రంగనాయకులు,పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్,నాయక్,సిసింద్రీ,నరసింహ, రామాంజనేయులు,ఏఎన్ఎం శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్లు పట్టివేత

**కొత్తపల్లి,జూలై26,ప్రభాతవార్త :** మండల పరిధిలోని సింగరాజుపల్లి గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను శుక్రవారం పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు.ఏఎస్ఐ బాబాఫకృద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన రవికుమార్ అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీస్‌లు తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో 20 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాబాఫకృద్దీన్ తెలిపారు.

## 30 లీటర్ల నాటుసారా స్వాధీనం



**గడివేముల, జూలై 26, ప్రభాతవార్త;** మండలంలోని తిరుపాడు గ్రామంలో నాటుసారా అమ్ముతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు నంద్యాల సెబ్ ఇన్‌స్పెక్టర్ జి.విశ్వనాథరెడ్డి, సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. ఇందులో గ్రామానికి చెందిన పి.కృష్ణవేణి అనే మహిళ వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సెబ్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా తమకు సమాచారం అందిస్తే దాడులు నిర్వహించి సారా అమ్మే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ దాడుల్లో సెబ్ ఇన్‌స్పెక్టర జి.విశ్వనాథ్‌రెడ్డి, ఎక్సైజ్‌శాఖ కానిస్టేబుల్ ఎస్.వి.కృష్ణయ్య, కానిస్టేబుల్ ఫాజిల్‌బి, కానిస్టేబుల్ రవికుమార్ పాల్గొన్నారు.

## ఎస్‌సి,ఎస్‌టి,బిసిలకు భూసేకరణ చేసి ఇంటిపట్టాలు ఇవ్వాలి.. - ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



**ఆదోని అర్బన్,జూలై 26,ప్రభాతవార్త :** మండల పరిధిలోని బసాపురం గ్రామంలో 40సం॥ల నుండి నివసిస్తున్న ఎస్‌సి,ఎస్‌టి,బిసి కుటుంబాలకు భూసేకరణ చేసి ఇంటి పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మంత్రి సత్యప్రసాద్‌ని కోరారు. శుక్రవారం విజయవాడలోని క్యాంపు ఆఫీసు నందు రెవెన్యూ అండ్ స్టాంప్స్,రిజిస్ట్రేషన్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ని ఎమ్మెల్యే పార్థసారథి కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గత 40సం॥ల నుంచి నివాసముంటున్న ఎస్‌సి,ఎస్‌టి,బిసి కుటుంబాలకు భూ సేకరణ చేసి ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో వాల్మీకి,టిడిపి సీనియర్ నాయకులు పోలినేని సూర్యనారాయణ,జనసేన ఇంచార్జ మల్లప్ప,తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి,ఏనుగుల వెంకట్రాంలు వున్నారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలి - ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ



**ఆదోనిలీగల్, జూలై26, ప్రభాతవార్త;** రోడ్డు మీద తిరిగే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని పట్టణ ట్రాఫిక్ సీఐ మంజునాథ్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని కొత్త బస్టాండు సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఆటోలు రోడ్డుకు అడ్డదిడ్డంగా ఉంచరాదన్నారు. ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, బండి రికార్డులు తమవెంట కలిగి ఉండాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరువ్యాపారస్థులు పక్కన ఉన్న డ్రెయినేజీ కాలువలను దాటి ముందుకు రాకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ అవగాహన సదస్సులో ఏఐఎస్ఐ సత్యనారాయణ, కానిస్టేబుల్ రమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు శాశ్వతంగా ఒకే రకంగా ఉండవు - మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి



**వెల్దుర్తి,జులై26,ప్రభాతవార్త :** ప్రభుత్వాలు శాశ్వతంగా ఒకే రకంగా ఉండవని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి అన్నారు.వెల్దుర్తికి చెందిన వైకాపా కార్యకర్త రహిమాన్ గత రెండు రోజుల కిందట తెదేపా కార్యకర్తల చేతిలో తీవ్రం గా గాయపడ్డ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి శుక్రవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు.అతన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం వచ్చాక వైకాపా కార్యకర్తలపై దాడులు పెరిగాయన్నారు.బాధిత కుటుంబానికి తాను అండగా ఉంటానన్నారు.దాడుల్ని అరికట్టాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని విమర్శించారు.

## 26వ వార్డులో పర్యటించిన టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్



**నంద్యాల, జూలై 26, ప్రభాతవార్త ప్రతినిధి:** వార్డు ఇంచార్జ్ దూదేకుల దస్తగిరి, 27వ వార్డు కౌన్సిలర్ జైనాబి అధ్వర్యంలో జరిగిన వార్డు పర్యటనలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొని వార్డు అంతా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ దేవనగర్‌లో పర్యటిస్తు ప్రజలను అప్యాయంగా పలకరిస్తు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 27వ వార్డు నందు రోడ్లు, కాల్వలు, వీధి లైట్లు సరిగ్గా లేవని ప్రజలు తెలియజేయడంతో వెంటనే అధికారులకు సమస్యలను తెలిపి వాటిని పరిష్కరించాలని కోరారు. ఖాళీ స్థలాల్లో మురికినీరు నిల్వ ఉండడంతో అక్కడ నివసించే ప్రజానీకానికి ఇబ్బందిగా మరియు వ్యాధులు సోకే అవకాశం ఉందని ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలియజేశారు. అనంతరం దేవనగర్ నందు ప్రభుత్వ హాస్టల్‌ను, స్కూల్‌ను, చిన్న ఆసుపత్రిని సందర్శించి అక్కడి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. వాటిని మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని తెలిపారు. సమస్యలు విని సానుకూలంగా స్పందించిన ఎన్ఎండి ఫిరోజ్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన టీడీపీ నాయకులు



**కౌతాళంరూరల్, జూలై26, ప్రభాతవార్త;** మంత్రాలయం టీడీపీ సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య కుమారులు సురేష్‌నాయుడు, టీడీపీ కుటుంబ సభ్యులు శుక్రవారం మంత్రి నారా లోకేష్‌ను శుక్రవారం విజయవాడలో కలిశారు. మంత్రాలయం నియోజకవర్గంలో ప్రజలు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్జీ రూపంలో అందజేశారు. మంత్రాలయం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పట్టాబి, భాస్కర్, సత్యనారాయణ, లలిత్‌సాగర్, నాగరాజు, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**గోనెగండ్ల జూలై 26 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన గోనెగండ్ల గ్రామ శివార్లలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహన ఢీ కొనడంతో గంజహళ్ళి గ్రామానికి చెందిన మధుసూదన్ (42) అనే వ్యక్తి మృతి చెందినట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు గంజహళ్ళి గ్రామానికి చెందిన మధుసూదన్ గంజహళ్ళి నుంచి గురువారం సాయంత్రం ఎమ్మిగనూరు కు తన స్వంతపనిపై వెళ్లారు.అక్కడ పని ముగించుకొని గంజహళ్ళి గ్రామానికి రాత్రి పయనమయ్యాడు.అయితే శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గోనెగండ్లలోని వివర్స్ కాలనీ సమీపంలో రోడ్డు పై శవమై పడిఉన్నాడు.దీన్ని గమనించిన వారు పోలీసులకు సమాచారం అందించారు.వారు శవాన్ని పరిశీలించి గంజహళ్ళి గ్రామానికి చెందిన మధుసూదన్‌గా గుర్తించారు.మృతునికి భార్య సరస్వతి ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు.మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## శాకాంబరి అలంకారంలో అమ్మవారు....



**మిడుతూరు, జూలై26, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన మిడుతూరులో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కొలువైన అమ్మవారిని శుక్రవారం శాకంబరి అలంకారంతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలోని విఘ్నేశ్వరుడు,అయ్యప్పస్వామి, పార్వతీ పరమేశ్వరులు, నందీశ్వర్లు, అమ్మవార్లను, సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, నాగశేషులు, నవగ్రహ విగ్రహాలకు, ధ్వజస్తంభాలకు,అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో శుక్రవారం, మంగళవారం వంటి ప్రత్యేక దినాల్లో అమ్మవారిని శాకాంబరి అలంకారంలో పూజించి, అదేవిధంగా కుంకుమార్చన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణమోహన్ మాట్లాడుతూ అమ్మవారి విశిష్టతను గురించి తెలియజేస్తూ భక్తిశ్రద్ధలతో ఆమెను పూజించి ఆశీర్వాదాలు పొందాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలు పూజలు, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భూమా కృష్ణమోహన్, దొంతు కృష్ణమూర్తి, సత్యమయ్య, కటకం వెంకయ్య, రోశయ్య, పరమయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాయితీతో జీలుగ విత్తనాలు పంపిణీ చేసి రైతులను అదుకోండి - జేసి



**నంద్యాల,జూలై 26,ప్రభాతవార్తప్రతినిధి :** నంద్యాల జిల్లా వ్యాప్తంగా రైతులకు రాయతీతో జీలుగ విత్తనాలు పంపినీ చేసి రైతులను అదుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టరు విష్ణుచరన్ వ్యవసాయ అదికారులకు అదేశాలుజారీ చేశారు. శుక్రవారము నంద్యాలమండలంలోని బిల్లలాపురము గ్రామంలో జేసి పర్యటించారు. ఈసందర్బముగా ఖరీప్ లో వరి సాగు కోసం రైతులు సాటు చేసిన పచ్చిరొట్టే పైరులను జాయిబట కలెక్టరు పరిశీలించారు. అనంతరము అయన వ్యవసాయ అదికారులతో మాటా్లడుతూ ఖరీప్ సీజన్ అరంభమైందని రైతులు వరిసాగుకు సమాయత్తము అవుతున్నారని చెప్పారు. ఇలాంటి సమయంలో రైతులు వరి కంటే ముందుకుగా పచ్చిరొట్టే పంటలు సాగు చేస్తారని చెప్పారు. అందుకు కోసం రైతులకు జీలుగ విత్తనాలు రాయితీతో అందించి వారిన అదుకోవాలని సూచి ంచారు. నంద్యాల జిల్లా మొత_ం రాయితీతో అందించాలన్నారు. ప్రతి రైతుకు ఎకరాలకు 12కిలో ప్రకారము జీలుఎగ విత్తగనలు అవసరమవుతాయని 30రోజుల్లో పంట వేపుగా పెరిగి పూర్తిదశకు చేరుకుంటుందిన జిల్లా వ్యావాసాయ అదికారి మురళీకృష్ణ జేసికి నివేదిక ఇచ్చారు. అనంతరము సీడ్ విలేజ్ వరి విత్తన నర్సరీని జేసి పరిశీలించారురైతు సేవా కేంద్రాన్ని కూడా తనికీ చేసి సబ్సిడీపై విత్తనాలు ఎలా ఇస్తున్నారని ఒక్కోక్క రైతుకు ఎంత మేర ఇస్తున్నారని అని గ్రామ వ్యవసాయ సహాయకులను జేసి ప్రశ్నించారు. రైతు సేవా కేంద్రంలో ప్రదర్శించిన పొతంబడి సీడ విలేజ్ ప్రోగ్రాం కింద చేపట్టిన అంశాలను పరిశీలించారు.బిల్లాలాపురములో 114 మంది సిసిఅర్సి కార్డులకు అర్హత పొందారని డిఈవో జాయింట్‌కలెక్టరుకు తెలిపారు. అనంతరము జేసి కౌలు రైతులకు సిసిఅర్సీ కార్డులను పంపిణీ చేశారు.

## నింధితులను వెంటనే అరెస్టు చేసి రక్షణ కల్పించండి



**హొళగుంద,జూలై 26,ప్రభాతవార్త :** మాపై దాడి చేసి కులం పేరుతో దూషించిన నింధితులను వెంటనే అరెస్టు చేసి మాకు రక్షణ కల్పించాలని ముద్దటమాగి గ్రామ దళితులు డిఎస్‌పిని కోరారు. శుక్రవారం దళితులు నగేంద్ర,వందరప్ప తదితరులు విలేకర్లతో మాట్లాడుతూ మొన్న జరిగిన మొహరం వేడుకల్లో గొల్ల తిమ్మారెడ్డి,గొల్ల ప్రకాశంతో పాటు మరో 12మంది దళితులైన మాపై దాడి చేసి కులంం పేరుతో దూషించడమే కాకుండ మహిళలను కూడా కొట్టి జాకెట్లు చించి మహిళలను కూడా కొట్టారన్నారు. వారిపై కేసు నమోదు చేసి వారం రోజులు అవుతున్నా ఇంతవరకు అరెస్టు చేయలేదన్నారు. మీరు కేసు వాపసు తీసుకుని మాతో రాజీ పడకపోతే మీకు దేవాలయాల ప్రవేశాలు ఉండవు,స్మశాన వాటికలో మీ వాళ్లని ఎలా పూడుస్తారో,మీ పొలాలకు ఎలా తిరుగుతారో చూస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటి నుండి మిమ్మల్ని కూలీలకు పిలవం గ్రామం నుండి వెలివేస్తామని బహిరంగంగా మాట్లాడడం దళితులైన మా మధ్యలో వర్గవైశ్యామ్యాలు పెంచి లబ్ది పొందడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. మాకు జరిగిన అన్యాయంపై కేసులు పెడితే తిరిగి మాపై కౌంటర్ కేసులా అని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కూడా నిజాలు తెలుసుకోకుండ కౌంటర్ కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా డిఎస్‌పి విచారణ చేపట్టి నింధితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## విశ్వనారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి




**ఆదోని విద్య,జూలై 26,ప్రభాతవార్త :** పట్టణంలో ఉన్న విశ్వనారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌ఓ డివిజన్ సెక్రటరీ శివ డిమాండ్ చేశారు. శుక్రవారం పిడిఎస్‌ఓ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డులో రాయల్ ఎన్‌ఫీల్డ్ రోడ్డు దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా శివ మాట్లాడుతూ విశ్వనారాయణ కళాశాలలో అనేక రకాలుగా సమస్యలు ఉన్నాయని వాటిలో ప్రధాన సమస్యలు జూన్ అకాడమీ ఇయర్ నుండి ఫిబ్రవరి మార్చి వరకు అధ్యాపకుల ద్వారా టీచింగ్ చెప్పించాలన్నారు. ఆ విధంగా కాకుండ కేవలం జూన్ నుండి నవంబరు,డిసెంబరు వరకు మాత్రమే అధ్యాపకులను పెట్టుకుని తర్వాత లెక్చరర్ లేకుండ స్టడీ అవర్స్ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. వేలకువేలు ఫీజులు వసూలు చేసినప్పుడు విద్యార్థులకు సరైన విద్యను ఎందుకు అందించలేకపోతున్నారన్నారు. ఇలాంటివి గతంలో చాలా జరిగాయన్నారు. ఇప్పటికైనా విద్యాధికారులు విశ్వనారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా కన్వినర్లు నికిత,కృష్ణవేణి,డివిజన్ నాయకులు అశోక్,గోవిందు, బసవ,ప్రవీణ్,నవీన్‌కుమార్,అజయ్ తదితరులున్నారు.

## వేరుశనగ,పత్తి పంటలు సందర్శించిన వ్యవసాయాధికారులు



**ఆదోని రూరల్,జూలై 26,ప్రభాతవార్త :** మండల పరిధిలోని నాగలాపురం గ్రామ పొలాల్లో రైతులు వేసిన పత్తి,వేరుశనగ,కొర్ర పంటలను కర్నూలు డిఆర్‌సి ఏడిఏ డాక్టర్ వెంకటేశ్వర్లు,ఆదోని ఏడిఏ అరుణకుమారిలు సందర్శించి పంటల యందు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వేరుశనగ పంట 30నుండి 45రోజుల కాలవ్యవధి కలిగి పొగాకు,లద్దె పురుగు ఉన్నట్లుగా గమనించినట్లు తెలిపారు. దీనికి ఎకరానికి రెండు కిలోల బెల్లం,5కిలోల తవుడు మరియు క్లోరోపైరీఫాస్ కలుపుకుని సాయంత్రం వేలల్లో ఉండలుగా చేసి పొలం నందు వెదజల్లడం వల్ల ఈ పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. అంతేకాక వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని బెట్టకు వచ్చిన పంటలకు 2శాతం యూరియా ద్రావణాన్ని పిచికారి చేయాలని రైతులకు తెలియజేశారు. అలాగే కొర్ర పంట నందు కాండం తొలుచు పురుగు గమనించామన్నారు. దీనికి (కెల్డాన్) కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ అనే మందును ఎకరానికి పావు కిలో పిచికారి చేసుకోవాలని కోరారు. పత్తి పంట నందు దోమ ఉధృతిని తగ్గించడానికి పసుపు రంగు నూనె పూసిన అట్టలను ఎకరానికి 10చొప్పున మొక్క కంటే కొద్దిగా ఎత్తులో ఉంచడం వల్ల తెల్ల,పచ్చ దోమ యొక్క ఉధృతిని తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అశోక్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.